# వీడు మారడు

'ఆ మనిషి ఇవ్వాళయినా వస్తాడా? నౌకరీ అంటే లెక్క లేకుండా పోతున్నది జనాలకు!' అనుకున్నాడు రఘురామయ్య. అతనికి చిరాగ్గా ఉంది.

ఇంకా ఎనిమిదిన్నర గంటలే. స్కూలుకు ముందొచ్చిన పిల్లలు ఆవరణలో ఆడుకుంటున్నారు.

'తనంటే ముందు వచ్చికూర్చుంటాడు కానీ అందరూ ముందెందుకు వస్తారు?' అనుకున్నాడతను.

కోపంగా ఉంది అతనికి రంగరాజంటే. క్రితం రోజు ఫోను చేసి, "సార్, నా పని కాలేదు. ఇంకో రెండు రోజులు లీవు కావాలి" అని అడిగాడు.

'ఏం ఇంకా నీ పెళ్ళాన్ని అమ్మటం కాలా?' అని అడుగుదామనుకుని కూడా తమాయించుకుంటూ, "నువ్వు వెళ్ళేటప్పుడు లీవు గ్రాంటు చేయించుకు వెళ్ళలేదు. లెటరు రాసి నా టేబులు మీద పారేసి వెళ్ళిపోతావా? ఇప్పుడు ఫోను చేసి ఇంకా రెండు రోజులు లీవు కావాలంటావా? స్కూలు ఎలా నడవాలి? మళ్ళా ఎన్నికలొస్తున్నాయి. వోటరుల ఎన్‌రోలుమెంటుకు కొంతమంది టీచర్లను పంపమంటూ మునిసిపాలిటీ తాఖీదు! నా వల్ల కాదు ఈస్కూలు నడపటం. నువ్వు రేపటికల్లా వచ్చావో సరే, లేకపోతే నీకు గ్రాంటు చేసిన ఈ నాలుగు రోజుల సెలవు కూడా కాన్సిలు చేస్తాను" అని అరిచాడు పెద్దగా హెడ్‌మాష్టరు, రఘురామయ్య. అవతలనుండి బదులు లేదు. ఫోను కట్ చేశాడు రంగరాజు.

అతను ఇవ్వాళ స్కూలుకు రావాలి. వస్తే ముక్కచీవాట్లు పెట్టాలనుకున్నాడు రఘురామయ్య. చెప్పకుండా వెళ్ళిపోయినందుకు కూడా కోపం రాలేదు అతనికి. లీవ్ లెటర్లో రంగరాజు, 'సిన్స్ ఐ హావ్ టు గోటు మై విలేజ్ టు సెల్ మై లాండ్ ఎలాంగ్ విత్ మై వైఫ్, ప్లీజ్ శాంక్షన్....' అని రాశాడు. 'వీడి బొంద ఇంగ్లీషు! పొలంతో పాటు పెళ్ళాన్ని

కూడా అమ్మేస్తాడా? అక్కడికీ తను నెత్తీ నోరూ కొట్టుకు చెప్తాడు ఇంగ్లీషు రాకపోతే, లీవు లెటరు తెలుగులో తగలెట్టండి అని. వినరు. ప్రిస్టేజి ఇష్యూ. మొన్నటికి మొన్న ఆ సోషల్ స్టడీస్ మాష్టరు, శ్రీనివాసు, కొడుకు పుట్టెంట్రుకలు తీయించటానికి యాదగిరిగుట్ట వెళ్తూ, 'ఏజ్ ఐ వాంట్ టు షేవ్ మై సన్స్ హెడ్...' లీవు కావాలని రాశాడు.

"ఇదేంటయ్యా! ఇట్టా రాశావు! నువ్వే గుండుగీకుతావా నీ కొడుక్కు?" అని తను అడిగాడు.

"నేను కాకపోతే క్షురకుడు. దరిద్రపు మ్లేచ్ఛభాషలో దేవుఁడికి తలనీలాలు సమర్పించటానికి సరైన మాటేలేదే! మన దౌర్భాగ్యం అట్టాంటి క్షుద్రభాషలో సెలవు అభ్యర్థన పత్రాలు రాయాల్సి వస్తున్నది" అన్నాడతను.

"ఓర్నీయమ్మ! నీ కడుపుడక! అవేం మాటలయ్యా! ఆడలేక మద్దెలమీద పడి ఏడ్చినట్టు! మన చాతకాని తనానికి భాష మీద పడి ఏడవాలా? ఇంగ్లీషులో రాయమని ఎవడేడ్చాడూ? తెలుగులో తగలెట్టొచ్చుగా?" అన్నాడు హెడ్మాష్టరు.

శ్రీనివాసు దగ్గరగా వచ్చి రహస్యం చెబుతున్నట్టు, "తెలుగులో రాస్తే బట్టబయలే కదండీ! ఇంగ్లీషు ఎవడికీ సరిగా రాదు కనుక సేఫ్. అందుకే ఇంగ్లీషులో రాయటం. లేకపోతే శుభ్రంగా తెలుగులోరాసేవాళ్ళం. మీరు కూడా సీక్రెటు విషయాలేమన్నా ఉంటే ఇంగ్లీషులో రాసి పెట్టుకోండి" అని ఓ ఉచిత సలహా పారేశాడు.

నిజానికి ఆరోజు రఘురామయ్య మూడేం బాగా లేదు. ఎనిమిదింటికి స్కూలుకు బయలుదేరి, పెన్ను కన్పించక రాక్ మీద వెతుకుతూ, అనాలోచితంగా కూతురు నోట్‌బుక్ కనిపిస్తే తెరచి చూశాడు.తెరవంగానే కన్పించింది, పెద్ద పెద్ద అక్షరాల్లో-

**మీరు ప్రేమలో పడ్డారో లేదో తెలుసుకోటానికి ద్వాదశ మార్గాలు**- కన్పించింది 'ఇదెక్కడి తంటారా బాబూ!' అనుకుంటూ చదివాడు.

12) మీరు అతను/ఆమెతో రాత్రి చాల సేపు మాట్లాడారు. అయినా, పడుకోబోయే ముందు అతను/ఆమె గుర్తుకు వస్తూంటే-

11) మీ పక్కన అతను/ఆమె ఉండి, మీరు నిజంగానే మెల్లగా నడిస్తే-

10) అతను/ఆమె వేరే ఊర్లో దూరంగా ఉన్నప్పుడు మీకేం తోచనట్టుగా ఉంటే-

09) అతను/ఆమె గొంతు వినగానే మీ పెదాలపై చిరునవ్వు మొలిస్తే-

08) మీరు అతను/ఆమెను చూస్తున్నప్పుడు, చుట్టుపక్కల మరెవరూ మీకు కన్పించకపోతే-

అంటూ ఇలాంటి పనికిమాలిన లక్షణాలు పన్నెండూ చెప్పేశాక, 'ఇందులో సగం పైన లక్షణాలు మీకుంటే మీరు ప్రేమలో పడ్డట్టే' అని రోగ నిర్ధారణ చెయ్యటం జరిగింది.

'ఆ, పడ్డట్టే నడుములు విరిగేట్టు! తనకూతురు పాపిష్టిది ఏ పత్రికలోనో చూసి రాసుకుని ఉంటుంది. ఎందుకు రాసి ఉంటుంది చెప్మా? దీనిక్కూడా ఈ ప్రేమ జబ్బు లక్షణాలు ఏవో సోకి ఉంటాయి. అదేదో తేల్చాలి' అనుకుంటూ, "అనూరాధా!" అని పిల్చాడు.

"అది కాలేజీకి వెళ్ళిందదండీ, ప్రయివేటు క్లాసుందిట!" అని అరిచింది అతని భార్య వంటింట్లోనుండి.

"ఎనిమిదింటికేం ప్రైవేటు క్లాసూ?"

"మీ పంతుళ్లకు టైమేముంది? ఎప్పుడైనా పెడతారు. ఎప్పుడూ బడి తప్ప మరో ధ్యాసవుంటుందా? పెళ్ళాలకు ఇంట్లో దమ్మిడీ సాయముండదు. ఏ పూలతో పూజిస్తేనో ఈ జన్మలో పంతుళ్ళకు పెళ్ళాలవటం!..."

ఇప్పుడు భార్యకు జవాబు చెప్పే తీరికలేదు రఘురామయ్యకు.

'సాయంత్రం ఆ ప్రయివేటు క్లాసు సంగతేమిటో, ఈ ద్వాదశ రోగ లక్షణాల సంగతేమిటో తేల్చాలి. ఈ జబ్బు ముదురు పాకాన పడితే ఓ పట్టాన వదలటం కష్టం' అనుకున్నాడు. అయితే, ఒకందుకు సంతోషం కలిగింది రఘురామయ్యకు- 'ద్వాదశ' అంటే 'పన్నెండు' అని కూతురికి తెలిసినందుకు.

పావుతక్కువ తొమ్మిదైంది. పంతుళ్ళు, పంతులమ్మలు ఒక్కొక్కళ్ళే వచ్చి, అటెండెన్స్ రిజిష్టరులో సంతకం పెట్టి, స్టాఫ్ రూం లోకి వెళ్తున్నారు. అప్పుడు చెమటలు కక్కుకుంటూ, హడావుడి పడుతూ వచ్చాడు లెక్కల మాష్టారు, పానకాల రావు.

"సార్, మా మదరిన్లా చచ్చి పోయింది సార్, నాకు మూడు రోజులు శలవ కావాలి సార్, ఆమె దహన సంస్కారాలు కాగానే వచ్చేస్తాను సార్...." అన్నాడు.

"ఏం ఏమయింది? ఆసుపత్రిలో చేర్పించాం. ఇప్పుడు నయంగానే ఉందంటివిగా మొన్న!"

"ఏమయిందో మరి. సడెన్‌గా ముంచుకొచ్చింది."

"సరే, శలవ చీటీ రాయి. ఈలోపల నేను అసెంబ్లీకి వెళ్ళి వస్తాను" అని లేచి బయలుదేరాడు రఘురామయ్య.

'ఇంకా రంగరాజు రానేలేదు. అయినా పానకాల రావుకు శలవు ఇవ్వక తప్పదు. అత్త చచ్చిపోయి వున్నా శలవు ఇవ్వలేదు కర్కోటకుడు అంటారు' అనుకున్నాడు.

ప్రార్థనయి, పిల్లలంతా ఎవరి క్లాసులకు వారు వెళ్ళిపోయాక, తన గదికి వచ్చాడు రఘురామయ్య. అతను టెన్త్ క్లాసుకు ఇంగ్లీషు తీసుకుంటాడు. మొదటి రెండు పీరియడ్లలో అడ్జస్టుమెంట్లు, మిగతా వ్యవహారాలూ చూసుకున్నాక మూడో పీరియడుకు క్లాసుకు వెళ్తాడు. 'ఇంక రంగరాజు ఇవాల్టికి రానట్టే' అనుకుంటే మండిపోయింది రఘురామయ్యకు. అంతలో లీవు లెటరు రాసి పట్టుకొచ్చాడు పానకాల రావు, లీవు శాంక్షను చెయ్యమని. పచ్చపెన్నుతీసి సంతకం పెట్టబోతూ చదివాడు హెడ్‌మాష్టరు.

పానకాలరావు రాశాడు: "ఏజ్ మై మదరిన్లా హాజ్ ఎక్స్‌పైర్డ్ అండ్ ఐ యామ్ ఓన్లీ రెస్పాంన్సిబుల్ ఫర్ ఇట్, ప్లీజ్ గ్రాంట్ మి వన్ వీక్‌లీవ్"

"నువ్వు చంపేశావుటయ్యా మీ అత్తని?" అనడిగాడు హెడ్‌మాష్టరు తీక్షణంగా. "ఇంగ్లీషు రాకపోతే ఎందుకయ్యా రాయటం? ఫో, వెళ్ళి చక్కగా తెలుగులో రాసుకురా. అప్పుడు నీకు శలవు మంజూరు చేస్తాను" అని హుంకరించాడు హెడ్‌మాష్టరు.

'ఏంవిటో ఈ మనిషి., స్పెల్లింగు ఏదయినా తప్పుందో ఏం పాడో! చెప్పి చావడు, ముసలి పీనుగ!' అని గొణుక్కుంటూ, స్టాఫ్‌రూం లోకి వెళ్ళి, మరో కాయితం మీద తను ఇంగ్లీషులో రాసిన శలవు చీటీని తెలుగులోకి అనువదించి పట్టుకొచ్చాడు పానకాల రావు.

హెడ్‌మాష్టరు చదివాడు."నా మదర్ఇన్లా చనిపోయింది. అందుకు నేనొక్కడనే బాధ్యుడను. కాన నాకు ఒక వీక్ డేస్ లీవు ఇవ్వవల్సింది."

"ఇది తీసుకెళ్ళి పోలీసు స్టేషనులో ఇచ్చిరా. నిన్ను బొక్కలో పెడతారు" అన్నాడు రఘురామయ్య కస్సుమంటూ.

"ఎందుకండీ, నేనేం తప్పు చేశాను."

"అంత అమాయకంగా మాట్లాడతావేమయ్యా? మదరిన్లాకు తెలుగు లేదా? ఆ ఇంగ్లీషు మదరిన్లా మృత్యువుకు నువ్వేబాధ్యుడవని రాస్తే పాపం వాళ్ళుమాత్రమేం చేస్తారు, నిన్ను బొక్కలో తొయ్యటం తప్ప! ఎందుకయ్యారయ్యా మీరంతా, పంతుళ్లయారు

నా ప్రాణం తియ్యటానికి!"

"నేను మాథ్స్ టీచర్ని సార్! నాకు తెలుగు, ఇంగ్లీషు అంత బాగా రాకపోయినా ఇబ్బంది లేదు..."

"పోనీ, లెక్కలు బాగా వచ్చునా? మొన్న డిఇవొ వచ్చినప్పుడేమన్నాడు...?"

'అసలే తను మదరిన్లా పోయిన దిగుల్లో ఉంటే ఈ హెడ్‌మాష్టరు గోలేమిటి?! ఆ డిఈఓ తనకు లెక్కలు రావన్నాడు, వాడికొచ్చేడ్చినట్టు! ఏ కొద్దిమందికో తప్ప చాలమందికి అసలు లెక్కలు రావు. ఎప్పుడో ఏవో పొరపాట్లు దొర్లుతాయి. ప్రతిదీ పట్టించుకుంటే బతుకు బండలే!'

"ఇంతకూ శలవు ఇస్తారా, లేదా?"

"ఎందుకివ్వనూ, వెళ్ళిరా. మళ్ళీ లీవు ఎక్‌టెన్షన్ అన్నావంటే మాత్రం ఊరుకోను."

'బతుకుజీవుడా!' అనుకుంటూ వెళ్ళిపోయాడు పానకాల రావు.

అంతలో క్లర్కు రాజమణి వచ్చాడు.ఏవో బిల్లులు తెచ్చి చూపెట్టాడు.

"ఇవి మనం సామాను తెచ్చిన షాపువి కావే?" అడిగాడు హెడ్‌మాష్టరు.

"కానీ, ఇవి కూడా వాడిచ్చినవే, సార్! పైగా ఈబిల్లులో సేల్సుటాక్సూ అదీ ఉండదు, సార్!"

"మరి సేల్స్ టాక్స్ వేశాడుగా? అది నువ్వు తినాలనా, నేను తినాలనా? బిల్లు మీద ప్రింటయిన షాపు ఈ లోకంలో ఉందా? రేపు ఏమయినా అయితే నా ఉద్యోగం పీకించెయ్యాలనా? ఏం వద్దు, అసలు బిల్లు పట్టుకు రా. అసలు దీంట్లో ఉన్న అయిటంలన్నీ వచ్చాయా? బిల్లులో వేసి నీ చేతిలో ఏమయినా పెట్టాడా?"

"అంత నమ్మకం లేకపోతే మీరే చెక్ చేసుకోండి, సార్!" అన్నాడు రాజమణి విరసంగా.

"ఒక్కణ్ణీ అన్నీ చూసుకోలేననేగా నీ ధీమా! ఎప్పుడో టైమొచ్చినప్పుడు ఆ పనీ చేస్తాను. అది సరే, ఆ ఎరియర్స్ బిల్లు ఎప్పుడవుతుంది? టీచర్లంతా నా వెంట పడుతున్నారు. బిల్లు సబ్‌మిట్ చేస్తేనేగా డబ్బొచ్చేది."

"చేస్తాను, సార్! ఒక్కణ్ణి! ఎన్నని చూసుకోను. క్రితం హెడ్‌మాష్టరు సారయితే

ఏ అదనపు పని వచ్చినా ఆయనే చూసుకునే వాడు. ఇలా నా ప్రాణం తీసేవాడు కాదు..."

రఘురామయ్య ఆ స్కూలుకు బదిలీ అయి వచ్చి నెలరోజులే అయింది. కొత్తగా వచ్చిన అధికారికి సహాయనిరాకరణ ప్రదర్శించి తమ అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం సిబ్బందిచేయటం కొత్తేంకాదు ఆయనకు. అందులో భాగమే రాజమణి చేస్తున్న ధిక్కారమని అర్థమయింది ఆయనకు.

"మరి అదనపు పన్లన్నీ ఆయనే చేసుకునే వాడా?"

"మరి నేనొక్కణ్ణి ఎన్ని పనులు చెయ్యను, సార్! అయినా మొన్న మనోహరు సారు మిమ్మల్ని బిల్లు అడిగితే, బిల్లు చేయిస్తే నాకే మొస్తదన్నారంట! 'అంటే, ఏందయ్యా, ఈయనకు బిల్లు చేయించినందుకు లంచమివ్వాలా?' అన్నాడు ఆ సారు."

ఓ క్షణం బిత్తర పోయాడు హెడ్మాష్టరు.

తేరుకుంటూ, "మంచి తెలివిగల వాడివోయ్! ఈ వెధవ గుమాస్తాగిరీ చెయ్యాల్సిన వాడివి కాదు నువ్వు. నీకు ప్రమోషను ఇవ్వాలని పైకి రాస్తా. నీ మాటలకర్థం– బిల్లు చేస్తే నీకేం ముట్టచెప్పాలనా? నీకూ, నాకూ అరియర్స్ రావు. అలాగని నువ్వు బిల్లు చెయ్యనన్నా, నేను సంతకం చెయ్యనన్నా కుదరదు. నీకు నాసంగతి తెలీదు. జాగ్రత్త. బిల్లు చెయ్యటం నీ డ్యూటీ. అందుకు లంచం అడిగినట్లు తెలిస్తే, తాట వలుస్తా" అన్నాడు హెడ్మాష్టరు, కోపంగా.

"నేను చెయ్యను, సార్! మీరేం చేస్తారో చేసుకోండి."

"నీ కిరాణా దుకాణం నీ పేరున ఉందా, నీ భార్య పేరున ఉందా?"

"అది మీకనవసరం."

"యువార్ ట్వటీ ఫోర్ అవర్స్ గవర్నమెంట్ సర్వెంట్, బాబూ! ఇక్కడ నీ విధ్యుక్త ధర్మం నిర్వర్తించకుండా, డిఈఓ ఆఫీసని చెప్పి వెళ్ళి, హోల్‌సేల్ దుకాణాల్లో నీ దుకాణం కోసం సామాన్లు తెచ్చుకోటం ఇక్కడందరికీ తెల్సు. నీ బతుకు బాగు కోసం నీ తంటాలేవో నువ్వు పడుతున్నావు. నేను కాదన్ను. అది అలుసుగా తీసుకుని ఇక్కడ పని ఎగ్గొట్టాలని చూశావో, అదనపు డబ్బు ఆశించావో, ఖబడ్దార్!"

మాట్లాడకుండా కోపంగా చూస్తూ వెళ్ళిపోయాడు రాజమణి. మూడో పీరియడ్ క్లాసు తీసుకుని వచ్చేటప్పటికి, నలుగురు మనుషులు హెడ్మాష్టరు కోసం నిరీక్షిస్తున్నారు. లోపల తన గదిలో సెటిలయాక వాళ్ళని లోపలకు పిల్చాడు. స్కూల్లో టెన్త్ క్లాసు చదివే

పిల్లవాడు విల్సన్ తండ్రి శామ్యూల్, అతని మేనమామ డేవిడ్, వచ్చిన మరిద్దరు అతని మామ స్నేహితులు. విల్సన్‌కు హాజరు సరిపోలేదని టెన్త్ క్లాసు పరీక్షకు పంపకుండా డిటైన్ చేసినందుకు హెడ్‌మాష్టరుతో మాట్లాడటానికి వచ్చారు వాళ్ళు.

తండ్రేం మాట్లాడ లేదు. మేనమామే మాట్లాడాడు. తన మేనల్లుడిని పరీక్షకు పంపాల్సిందేనని వాదించాడు. పంపకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిక చేశాడు అతడు.

అంతా తాపీగా విన్నాక, "నువ్వేం చేస్తున్నావయ్యా?" అని అడిగాడు హెడ్‌మాష్టరు.

"అది నీ కనవసరం. బేకారుగా తిరుగుతున్నా. చెప్పింది చెయ్యి. మర్డరయిపోతావు!"

"మర్డరుకు స్పెల్లింగు చెప్పరా, హాజరు లేకపోయినా నీ మేనల్లుడిని పరీక్షకు పంపిస్తాను."

"ఎం.ఏ.ఆర్.డి.ఇ.ఆర్. మాటమీద నిలబడేవాడివయితే విల్సన్‌ని ఎగ్జాంకు పంపు."

"ఇంకెక్కడ పంపించేది?మర్డరు చేశావు కదరా ఇంగ్లీషు భాషను. వాడిని నువ్వే ఫెయిలు చేశావు! నా మాట విను. బెయిలు మీద బయటున్నావు. విల్సన్ చెప్పాడు. నేను ఒక్కఫోను కొడ్తే నిన్ను తీసుకెళ్లి బొక్కలో తోస్తారు. పిల్లవాడు యేడాదిలో నెల రోజులు స్కూలుకు రాలేదు. ఒకవేళ నేను పంపినా వాడు పరీక్ష పాసు కాడు. 'నువ్వు పంపు, ఆ తరవాత సంగతేదో మేం చూసుకుంటాం' అంటావు! నీ విషయంలో మీ నాయన అలా చూసుకున్నాడు కనుకే, నువ్విలా లోపలకూ బయటకూ తిరుగుతున్నావు. బంగారంలాంటి పిల్లవాడి భవిష్యత్ పాడుచెయ్య దల్చుకున్నావా? ఇంకో యేడు స్కూల్లో చదివినందు వల్ల మునిగి పోయేదేంలేదు. ఏడీ, వాణ్ణి రమ్మను. వాడిని నేనే అడుగుతాను– చదువుకుని పరీక్షకు వెళ్ళటమో, వెళ్ళి కాపీ కొట్టి పట్టుబడటమో– ఏది మంచిదో?"

"ఏయ్, మాస్టర్! పుచ్చలెగిరి పోతయ్, జాగర్త!"

అలా విల్సన్ మేనమామ, డేవిడ్, అంటూనే ఉన్నాడు, హెడ్‌మాష్టరు లేచి నిలబడి, అతని చొక్కా పట్టుకుని గుంజి, మరో చెయ్యి చాచి అతని చెంప వాయించాడు.

"ఇది జంతువును సంకెళ్ళు వేసి బోనులో పెట్టనందుకు! పోలీసులకు ఫోను చేయనందుకు, సంతోషించు. ఈ సంఘటన తర్వాత నాకేం జరిగినా మొదటి అనుమానితుడివి నువ్వే అవుతావు! పిల్లవాడికి టిసి ఇచ్చి పంపెయ్యగలను. ఇంకెక్కడా

వాడిని చేర్చుకోరు. అయితే, నువ్వు ఒట్టి వెధవ్వని వాడి భవిష్యత్తును పాడు చెయ్యను, వెళ్ళు" అని అరిచాడు హెడ్‌మాష్టరు. చాక్కా పట్టుకున్నచేత్తో అతన్ని ఒక్క తోపు తోశాడు. అలా హెడ్‌మాష్టరు రియాక్షను ఉంటుందని ఊహించని డేవిడ్ బిత్తర పోయాడు.

అతని అరుపులకు అదిరి పోయారు రాజమణీ, స్టాఫ్‌రూంలో నుండి పరుగెత్తి వచ్చిన ఉపాధ్యాయులు. ఈ నస హెడ్‌మాష్టరు ఓ రౌడీని కొట్ట తెగించగలడని వాళ్ళూహించలేదు.

విల్సన్ తండ్రికి దిమ్మతిరిగి పోయింది. కొడుకుని తీసుకొచ్చి హెడ్‌మాష్టరు కాళ్ళ మీద పడేశాడు. మళ్ళీ సంవత్సరం చదివి పాసవుతానని పిల్లవాడి చేతే చెప్పించాడు హెడ్‌మాష్టరు. వాళ్ళు తిరిగి వెళ్ళిపోతూంటే పిల్చి, "డేవిడ్! 'జాగర్త' కాదు. 'జాగ్రత్త' అనాలి. జాగ్రత్త" అన్నాడు హెడ్‌మాష్టరు నవ్వుతూ.

మధ్యాహ్నం భోంచేసి కూర్చున్నాడో లేదో ఫోను మోగింది. రఘురామయ్య రిసీవరెత్తాడు "స్కూలేనా? నా పెళ్ళాన్ని పిలవరా" అని పలికాడో తాగుబోతు.

"నీ పెళ్ళాం ఎవర్రా?" అడిగాడు హెడ్‌మాష్టరు.

"అపర్ణ."

"ఓహో, శివుడి పెళ్ళామా?"

"ఓర్నీ, నువ్వెక్కడ తగిలావు రా బాబూ! శివుడి పెళ్ళాం కాదు, నా పెళ్ళాం. దానికిష్టలేకపోయినా నువ్వు తార్చేట్టున్నావే ఆ శివుడెవరికో."

"అపర్ణ అనగా ఏక పర్ణములో భుజించునది అని. అంటే పార్వతి. ఇక్కడ అట్టాంటి వాళ్లెవరూ లేరు."

"నువ్వెవరో నీకు తెలుగు కూడా సరిగ్గా తెలిసినట్టు లేదే. 'అపర్ణ' అంటే నా పెళ్ళాం. దాన్ని పిలువు. నా పెళ్ళాం పేరుకూడ తెల్సి చావదు, ఆ హెడ్‌మాష్టరు నడుగు, చెప్తాడు"

"సర్లే, ఉండు పిలుస్తున్నాను."

పిలవనంపితే అపర్ణ వచ్చింది స్టాఫ్ రూంలోనుండి. ఆమె తెలుగు పంతులమ్మ.ఆమె మొగుడు తాగుబోతని విన్నాడు హెడ్‌మాష్టరు. అతను ఎక్కడ పని చేస్తాడో ఏమోమరి, ఈమె జీతం తోనే సంసారం గడవాలి.

ఫోనులో మాట్లాడింది. రిసీవరు క్రెడిల్ చేసి మౌనంగా నిలబడింది.

"వెళ్ళాలా?" అడిగాడు హెడ్‌మాష్టరు.

ఆమె తల ఊపింది.

హెడ్‌మాష్టరు కారణంకూడా అడగలేదు, "వెళ్ళు" అన్నాడు.

"రెండో పీరియడు నైన్త్ బి క్లాసు ఉంది, సార్!"

"నేను తీసుకుంటాలే, వెళ్ళు."

ఆమెను పంపించేసి, రాజమణిని పిల్చి, ఇద్దరూ అరియర్స్ లెక్కలు కట్టటం మొదలెట్టారు.

రాజమణి పిల్చినవెంటనే వచ్చి పని మొదలెట్టాడు. లేకపోతే తన్నుకూడా కొడ్తాడేమోనని భయపడినట్టున్నాడు.

మొదటి పీరియడు కాగానే, "నేను క్లాసు తీసుకు వస్తాను. నువ్వు నేను లేనని పని ఆపక" అని నైన్త్ తెలుగు క్లాసు తీసుకోటానికి వెళ్ళాడు. హెడ్‌మాష్టరు క్లాసుకు వెళ్ళిన కాసేపటికి డెప్యూటీ డిఈఓ పంపాపతి వచ్చాడు.

హెడ్‌మాష్టరుకు కబురు వెళ్ళింది.

"సార్ని కూర్చోబెట్టి, మంచినీళ్ళివ్వు. చాయ్ తెచ్చివ్వు. నేను క్లాసుకాగానే వస్తానని చెప్పు" అని ప్యూనుకు డబ్బులిచ్చి పంపేశాడు రఘురామయ్య.

డెప్యూటీ డిఈఓ వచ్చింది ఎంక్వైరీకి. అరియర్స్ బిల్లు చెయ్యటానికి హెడ్‌మాష్టరు లంచమడుగుతున్నాడని జిల్లా విద్యాధికారి కెవరో ఆకాశరామన్న ఫిర్యాదు చేశాడు. ఆయన సంగతేదో తేల్చుకు రమ్మని తన డెప్యూటీని పంపాడు. రాంగానే పంపాపతికి బిల్లు తయారు చేస్తున్న రాజమణి కన్పించాడు. టీచర్ల నందర్నీ పిల్చి అడిగాడు డెప్యూటీ డిఈఓ. లెటరు సంగతి 'మాకు తెలీదంటే మాకు తెలీద'న్నారు వాళ్ళు.

నిజానికి అక్కడేమీ వుండదని డెప్యూటీ డిఈఓ పంపాపతికి తెలుసు. రఘురామయ్య, పంపాపతి ఇద్దరూ స్నేహితులు. పదేళ్ళు ఒకే స్కూల్లో కలసి పని చేసిన వాళ్ళు. పట్టు విడుపులు తెల్సినవాడు కావటాన పంపాపతి డెప్యూటీ డిఈఓ కాగలిగాడు. రిటైరు అయేలోపల డిఈఓ కూడా అవుతాడు. రఘురామయ్య చచ్చీచెడీ హెడ్‌మాష్టరు అయేటప్పటికి రిటైరుమెంటు వయసు వచ్చేసింది.

రెండో పీరియడు బెల్లయ్యాక హెడ్‌మాష్టరు వచ్చాడు. డెప్యూటీ డిఈఓ తను వచ్చిన పని చెప్పాడు. ఇద్దరూ నవ్వు కున్నారు.

"ఏవిటీమధ్య ఫైటింగులు కూడా చేస్తున్నావట!" అని అడిగాడు.

“ఈ మిశ్రమ భాష ఎందుకు? ‘కొట్లాటల్లోకి కూడా దిగుతున్నావట!’ అని అడగొచ్చుగా?” అన్నాడు రఘురామయ్య.

‘వీడు మారడు’ అనుకున్నాడు పంపాపతి.

“నీ భాషా పిచ్చి పాడుగాను! అది సరే, వాడు రౌడీ వెధవ. ఒక సారి నేరం చేసి ఉన్నవాడు. వాడేమయినా నిన్ను చేసి ఉంటే.”

“ఇట్ రిక్వైర్స్ లాట్ ఆఫ్ గట్స్ టు బీట్ ద హెడ్ ఆఫ్ద ఇన్‌స్టిట్యూషన్. హి కేమ్ టు మై సీట్ ఆఫ్ పవర్. ఐ డింట్ గో టు హిమ్. ఎనీ హౌ, ఇట్‌వాజె కాలిక్యులేటెడ్ రిస్క్.”

హోంబెల్ కొట్టగానే, హెడ్‌మాష్టరు లేచాడు, “లెట్స్ కాలిటె డే. ఏహోటల్లో అయినా కాఫీతాగుదాం.చాల రోజుల తరవాత కలిశావు” అన్నాడు.

*కథాకేళి* (మాస పత్రిక), సెప్టెంబరు 2010

కథా నిలయం
శ్రీకాకుళం